Neti Velugu
నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

RNI NO. TELTEL/2023/88559

తెలుగు దినపత్రిక

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 190 | పేజీలు : 8 | అక్టోబర్ 24 శనివారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 190 | PAGES:8 | SATURDAY OCTOBER 24 2026 | Rs. 4:00

మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం: కర్ణాటక సీఎం డీకే శివకుమార్

2

దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం పెంచాలి



- దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానం, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకుంటామని వెల్లడి
- హైదరాబాద్ పోలీసు వ్యవస్టను మూడు కమిషనరేట్లుగా పునర్వవస్థీకరించినట్లు ప్రకటన
- నేరాల నియంత్రణకు హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాల ఏర్పాటు
- సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని సీఎం వెల్లడి

దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర

(మిగతా 2వ పేజీలో..)

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్.. బీజేపీ సంచలన ఆరోపణలు

రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ

ఈ వివాదంతో తన కుమారుణ్ని తెరపైకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారన్న భండారీ

రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్న

రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్

కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు.వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ

(మిగతా 2వ పేజీలో..)



దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని వ్యాఖ్య

రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా

కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్

దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో



(మిగతా 2వ పేజీలో..)

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం.. టీపీసీసీ చీఫ్

- **బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనన్న మహేశ్ గౌడ్**
- **వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని వ్యాఖ్య**
- **పార్లమెంట్‌లో ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతిచ్చిందని విమర్శ**

కాళేశ్వరంపై కిషన్ రెడ్డి సీబీఐ విచారణ హామీ ఏమైందన్న మహేశ్ గౌడ్

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), భారత రాష్ట్ర



(మిగతా 2వ పేజీలో..)

సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్.. మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో గ్యాస్ లీక్ ప్రమాదం

ఇద్దరు కార్మికుల దుర్మరణం

సిగాచీ ఘటన నుంచి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదన్న హరీశ్

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో జరిగిన గ్యాస్ లీక్ ప్రమాదంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని

(మిగతా 2వ పేజీలో..)



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలని ఆదేశం

మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం

ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి తెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్.. మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాలను అమలు చేయకపోవడం వల్లే పదేపదే పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో జరిగిన సిగాచీ ప్రమాదం నుంచి ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ఆయన విమర్శించారు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.కార్మికుల భద్రతను పట్టించుకోకుండా, ప్రమాదాలు జరిగిన తర్వాతే అధికారులు ఫొటోలకు పోజులివ్వడానికి వస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి గురై జీవనోపాధి కోల్పోయిన 54 కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి హామీని వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా హరీశ్ రావు గుర్తుచేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం.. టీపీసీసీ చీఫ్

(మొదటి పేజీ తరువాయి)

సమితి (బీఆర్ఎస్) ఒక్కటేనని, వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గురువారం నిజామాబాద్ అర్బన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని మహేశ్ గౌడ్ విమర్శించారు. త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు బీఆర్ఎస్ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించకపోవడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ముందుగా బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించిన తర్వాత, బీఆర్ఎస్ కేవలం నామమాత్రంగా అభ్యర్థులను బరిలోకి దింపుతుందన్నారు.పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని, బీజేపీతో ఆ పార్టీకి ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇదే నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపిస్తామని గతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రకటన ఏమైందని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా నిలదీశారు.

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్.. బీజేపీ సంచలన ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే.ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు.అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది.ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.

దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం పెంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని చెప్పారు. ప్రజలు సమర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని సీఎం తెలిపారు. దీనివల్ల ప్రతి పోలీసు కమిషనర్ తన పరిధిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం కీలక సవాళ్లుగా మారాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో గుర్తించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణను నక్సలిజం రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు.ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా టీ-సేఫ్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించడంలో హైడ్రా కృషికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు కూడా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సీఎం పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు తనకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎం.ఏ.సలీం, తమిళనాడు డీజీపీ మహేశ్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలినీ సింగ్, లక్షద్వీప్ ఏడీజీపీ బి.శంకర్ జైస్వాల్, కేరళం ఐజీ అజిత బేగం, ఏపీ ఐజీపీ రవికృష్ణ, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన

లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులు కల్పించనున్న సర్కార్

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం: కర్ణాటక సీఎం డీకే శివకుమార్

తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్ చేసేందుకు ప్రయత్నించారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బీజేపీ, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రులపై కాకుండా కాంగ్రెస్ నేతలనే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కన్నడ వార్తా ఛానల్ ఏషియానెట్ సువర్ణ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఆరోపణలు చేశారు.ఓ పారిశ్రామికవేత్త తనను కలిసేందుకు వచ్చినప్పుడు మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించి ఉండటంతో అనుమానం కలిగిందని డీకే శివకుమార్ తెలిపారు. అధికారుల ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకున్న ఆ వ్యక్తి తొలుత వ్యాపార విషయాలు మాట్లాడారని, ఆ తర్వాత రాజకీయాలు, బూత్ స్థాయి వ్యూహాలు, రాజకీయ పరిణామాల గురించి చర్చ మొదలుపెట్టారని చెప్పారు. దీంతో ఆ వ్యక్తి నేపథ్యంపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.ఆ విచారణలో తనకు అందిన సమాచారం ప్రకారం.. ఆ పారిశ్రామికవేత్త కేరళ సీఎం వీడీ సతీశన్‌ను కలిసినప్పుడు కూడా అదే మెటా గ్లాసెస్ ధరించారని డీకే తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ను, ఓ కేంద్ర మంత్రిని కలిసినప్పుడు మాత్రం వాటిని ధరించలేదని పేర్కొన్నారు."ఆ వ్యక్తి నా దగ్గరకు, సతీశన్ దగ్గరకు వచ్చినప్పుడే మెటా గ్లాసెస్ పెట్టుకున్నాడు" అని డీకే శివకుమార్ అన్నారు. అయితే ఆ పారిశ్రామికవేత్త పేరును వెల్లడించలేదు. రహస్యంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించే ఆధారాలను కూడా ఇంటర్వ్యూలో బయటపెట్టలేదు.ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. తాము అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని, అయితే ఆ వివరాలను వెల్లడించడం లేదని చెప్పారు. తనకు అనుమానితుల గురించి సమాచారం అందిందని, మంత్రులు వ్యక్తిగత సహాయకులు, ఫోన్ కాల్స్ తదితర మార్గాల ద్వారా జరిగే ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు తెలిపారు."మంత్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాధినేతగా నాపై ఉంది" అని డీకే అన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నవారి పేర్లు, పత్రాలను సరైన సమయంలో బయటపెడతానని, ప్రస్తుతం వాటిని వెల్లడించే సమయం కాదని పేర్కొన్నారు.కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్యకు సంబంధించినట్లు చెబుతున్న స్టింగ్ వీడియోల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో డీకే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2011 నాటి వీడియోలను ఉపయోగించి సిద్ధరామయ్యను పదవి నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. అక్టోబర్ 8న జరిగిన కేబినెట్ సమావేశంలో, మంత్రులను స్టింగ్ ఆపరేషన్ల ద్వారా ఇరికించే ప్రయత్నాలు జరగవచ్చని డీకే హెచ్చరించినట్లు సమాచారం.ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్న పెన్‌డ్రైవ్ తన వద్ద ఉందని చెప్పారు. పోలీసు విచారణ కూడా కోరారు. అక్టోబర్ 14న రెండు వీడియోల ప్రసారాన్ని నిలిపివేస్తూ మీడియా సంస్థలు, డిజిటల్ వేదికలకు కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వీడియోల తయారీ, ప్రచారంపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి





- **ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలి -- జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి**

రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 23 నేటి వెలుగు ప్రతినిధి:

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి తెలిపారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల వివరాలను పరిశీలించి, ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, మున్సిపల్, జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ, రవాణా, ట్రాఫిక్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రధాన కారణాలని ఆమె తెలిపారు. వాహనదారులు అనుమతించిన వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రక్షణాత్మక డ్రైవింగ్ (డిఫెన్సివ్ డ్రైవింగ్) అలవర్చుకోవాలని, వాహనం నడిపేటప్పుడు పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.రంగారెడ్డి జిల్లాను రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ, రవాణా శాఖ, జాతీయ రహదారుల శాఖ, పోలీస్, ట్రాఫిక్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రానున్న పది నెలలు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి.







- **ఏ నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి -- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్.**

దేవరకొండ పట్టణం అక్టోబర్ 23 నేటి వెలుగు ప్రతినిధి

రానున్న పది నెలల పాటు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సర్పంచులు, గ్రామ కార్యదర్శులతో కోరారు. గ్రామాల్లో పైపులైన్ లీకేజీలు ,ఇతరత్రా నీటి వృధా లేకుండా నివారించి నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు. శుక్రవారం దేవరకొండ లోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో "ఎల్‌నినో ప్రభావం– తీసుకోవలసిన చర్యలపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎల్ నినో వల్ల వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు. గ్రామాల్లో చెరువులు, మిషన్ భగీరథ, బోర్లు, కాలువలు, వర్షపు నీటి ద్వారా లభించే నీటి నిల్వలపై ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామాలలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, నీటి నిల్వల వివరాలను గ్రామ కార్యదర్శులు తెలుసుకుని, వాటిని రానున్న నెలల్లో అవసరాలకు సరిపడా వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. జూలై వరకు నీటి కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విద్యుత్తును కూడా పొదుపుగా వినియోగించి సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. రానున్న రోజుల్లో తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలైన సజ్జలు, జొన్నలు, మినుములు, కందులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సుమారు 30 మంది రైతులు ఒక సమూహంగా ఏర్పడి సమిష్టి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలని, పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన రేషన్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కొత్త పంచాయతీల్లో రేషన్ షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల పరిష్కారానికి కూడా చర్యలు చేపడతామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ప్రకృతి వైపరీత్యంగా భావించి, సమష్టి కృషితో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.అనంతరం కలెక్టర్ సర్పంచులతో కలిసి క్రింద కూర్చుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం నివారణ, నీటి పొదుపుపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ (ప్రేమ్ కరణ్ రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ , పశు సంవర్ధక శాఖ అధికారి జివి రమేష్, డిపిఓ తరుణ్ చక్రవర్తి, ఇంచార్జ్ఎంపీడీవో పార్వతి, అధికారులు, సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు .

కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరుకు బీసీలు సిద్ధమవ్వాలి

బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ పట్టణం అక్టోబర్ 23 నేటి వెలుగు ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల అణచివేత ధోరణి మానుకోకపోతే మాత్రం తిరుగుబాటు తప్పదని మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికి బలహీన వర్గాల అణచివేతగానే ప్రభుత్వ పాలన కొనసాగుతుంది త్వరలో కాళీ అవుతున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అగ్రవర్ణ అభ్యర్థులనే ప్రకటించి తమ రాక్షస బుద్ధని మరోసారి నిరూపించుకున్నారు ఎన్నికల ముందు బీసీల జపం చేస్తూ ఎన్నికల పూర్తి అయిన తర్వాత బీసీల అణచివేత ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలు నేటికీ ఏ ఒక్కటే అమలు చేయలేదు దొంగ మాటలతో కపట ప్రేమను చూపించి ఓట్లు దండుకొని అధికారమెక్కి బీసీలను అవమానిస్తున్నారు ఈ అవమానానికి కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు కాంగ్రెస్ పార్టీలో బీసీ నాయకులే లేరా లేక బీసీలు కేవలం మీకు ఓటు వేసి కార్యకర్తల మీ వెనకాల తిప్పుకుంటూ జిందా బాద్ కొట్టించుకుంటున్నారు తప్ప బీసీలకు సంబంధిత స్థానం కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తి వ్యతిరేకతతో. ముందుకు సాగుతోంది త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పి బీసీల సత్తా చాటాలని ఆయన అన్నారు.బీసీ లారా ఇకనైనా మేల్కుందాం మన ఓటు మనమే వేసుకుందాం ఈ రాక్షస పాలన ను మనం ఎండగట్టకపోతే మాత్రం భవిష్యత్తు బీసీ తరాలు తీవ్ర ప్రమాదంలో ఉంటాయి కాబట్టి జరగబోయే ఎన్నికల్లో పట్టబద్రులందరూ బీసీ అభ్యర్థికి ఓట్లు వేసి బీసీల సత్తా, బీసీల బలం. ప్రభుత్వానికి తెలిసేలా చేద్దాం అని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో.. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి గంగాధర్, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి మహేష్, సందీప్, ఉపేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు



జనగణనపై జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులకు రెండో రోజు శిక్షణా తరగతులు నిర్వహణ...

- ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్ నాయక్.




నల్గొండ అక్టోబర్ 23 నేటి వెలుగు ప్రతినిధి::



జనగణన నిర్వహణకు సంబంధించి జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు.ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో తహసీల్దార్లు (చార్జ్ ఆఫీసర్లు), ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు (అదనపు చార్జ్ ఆఫీసర్లు)తో పాటు జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు అవసరమైన అవగాహన కల్పించడం, విధివిధానాలపై శిక్షణ అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

టిబీ రహిత సమాజానికి కృషి చేయాలి

- **టిబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి**
- **జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్**



సూర్యాపేట అక్టోబర్ 23 నేటి వెలుగు ప్రతినిధి

దేశవ్యాప్తంగా టిబీ నిర్మూలనపై చేపట్టే కార్యక్రమాలపై జిల్లాల కలెక్టర్లు, వైద్య ఆరోగ్య, ఎన్సీసీ అధికారులతో సమన్వయ సమావేశంటిబీ రహిత సమాజానికి కృషి చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధనా పట్నాయక్ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎన్సీసీ అధికారులతో దేశవ్యాప్తంగా టిబీ నిర్మూలనపై చేపట్టే కార్యక్రమాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి (టిబీ) నిర్మూలనకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టి, టిబీ రహిత గ్రామాల సంఖ్యను పెంచాలన్నారు. టిబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తూ క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక దగ్గు, తదితర టిబీ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వెంటనే సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి మండలంలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో జోష్ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజల్లో టిబీ లక్షణాలున్న వారిని గుర్తించే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఈ బృందాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, యువ క్రీడాకారులు , మై భారత్ వాలంటీర్లను భాగస్వాములను చేసి ప్రజల్లో వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలోనూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. టిబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం కూడా వ్యాధి నియంత్రణలో కీలకమని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వివిధ సంస్థల సహకారంతో టిబీ బాధితులకు పోషకాహార కిట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, సంబంధిత డాక్టర్లు, మెడికల్ సిబ్బంది, ఎన్సిసి అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

పానగల్ ఛాయా సోమేశ్వరాలయం అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు





- మంత్రి కోమటిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి
- పానగల్ ను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

నల్గొండ పట్టణం అక్టోబర్ 23 నేటి వెలుగు ప్రతినిధి

నల్గొండ జిల్లా కేంద్ర సమీపంలోని చారిత్రాత్మక పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయం, పరిసర ప్రాంతాల సమగ్ర సుందరీకరణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు గతంలో పానగల్ లోని శ్రీ చాయ సోమేశ్వర స్వామి దేవాలయం,పరిసర ప్రాంతాలు, సమీపంలోని జల వనరులను సమగ్రంగా అభివృద్ధి చేసి సుందరీకరించాలని ప్రతిపాదించారు. ఈ విషయాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఎట్టకేలకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కు రూ.20 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చింది. చరిత్రకు సజీవ సాక్ష్యం పానగల్ దేవాలయాలు –బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పానగల్ లోని పచ్చల, ఛాయా సోమేశ్వర దేవాలయాలు చరిత్రకు సజీవ సాక్ష్యమని నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.పానగల్‌లోని చారిత్రాత్మక శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.20 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రక ఆలయాల పరిరక్షణతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.పానగల్ ప్రాంత అభివృద్ధికి ఈ నిధుల మంజూరు కీలక ముందడుగుగా నిలుస్తుందని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



ప్రియదర్శి, నాగదుర్గ 'ఇడుపు కాయితం' విడుదల తేదీ ఖరారు

డిసెంబరు 11న 'ఇడుపు కాయితం' విడుదల

ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటన

వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం

బన్నీ వాస్ నిర్మాణంలో తెరకెక్కుతున్న చిత్రం

విడుదలైన 'గడప' లిరికల్ వీడియో

ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ డ్రామా 'ఇడుపు కాయితం'



విడుదల తేదీ ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి బన్నీ వాస్ వర్క్స్ పతాకంపై బన్నీ వాస్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. టైటిల్ ప్రకటనతోనే ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం తెలంగాణ కుటుంబ నేపథ్యంతో తెరకెక్కుతోంది.విడుదల తేదీ ప్రకటన నేపథ్యంలో శుక్రవారం చిత్ర బృందం 'గడప' పాట లిరికల్ వీడియోను విడుదల చేసింది. సురేశ్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం రాశారు. తేలు విజయ ఆలపించారు. 'ఇడుపు కాయితం' అంటే విడాకుల పత్రం అని అర్థం. ఈ పేరుతో రూపొందుతున్న సినిమా కుటుంబ సంబంధాలు, వాటి చుట్టూ సాగే కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

లవ్యూ.. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా గోపీచంద్ భావోద్వేగ సందేశం

నేడు ప్రభాస్ పుట్టినరోజు

సోషల్ మీడియాలో గోపీచంద్ ఎమోషనల్ పోస్ట్

నువ్వు ఎంత ఎదిగినా అద్భుతమైన వ్యక్తిగా ఉన్నావంటూ ప్రశంస

'వర్షం' సినిమా నుంచి కొనసాగుతున్న వీరి స్నేహం

ఆ చిత్రంలో హీరో, విలన్లుగా నటించిన ప్రభాస్, గోపీచంద్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా విషెస్ చెబుతున్నారు. అయితే, తన ఆత్మీయ స్నేహితుడైన హీరో గోపీచంద్ చెప్పిన శుభాకాంక్షలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ప్రభాస్‌పై తనకున్న ప్రేమను, వారి స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ గోపీచంద్ పెట్టిన ఎమోషనల్ పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది."హ్యాపీ బర్త్‌డే నా ప్రభాస్. జీవితం నిన్ను ఎంత దూరం తీసుకెళ్లినా, నీ వ్యక్తిత్వమే నీకు అతిపెద్ద బలం. నువ్వు ఇంత ఉన్నత స్థాయికి చేరినా, నీ అద్భుతమైన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడం పట్ల చాలా సంతోషంగా ఉంది. నీకు మరిన్ని విజయాలు, మంచి ఆరోగ్యం, అనంతమైన సంతోషం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. లవ్ యూ'' అంటూ గోపీచంద్ తన పోస్టులో పేర్కొన్నారు.టాలీవుడ్‌లో ప్రభాస్, గోపీచంద్‌లది విడదీయరాని స్నేహబంధం అని అందరికీ తెలిసిందే. వీరిద్దరి స్నేహం 'వర్షం' సినిమా సెట్‌లో మొదలైంది. 2004లో వచ్చిన ఈ బ్లాక్‌బస్టర్ చిత్రంలో ప్రభాస్ హీరోగా నటించగా, గోపీచంద్ ప్రతినాయకుడి పాత్రలో అద్భుతంగా మెప్పించారు. తెరపై బద్ధ శత్రువులుగా కనిపించినా, ఆ సినిమా నుంచే నిజ జీవితంలో మంచి స్నేహితులుగా మారారు. అప్పటి నుంచి నేటి వరకు వీరి స్నేహం చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. ఒకరి విజయాలను మరొకరు అభినందించుకుంటూ తమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నారు.



రైతుల వద్దకు వెళ్లి భూ సమస్యలను పరిష్కరించాలి.





- భూ సర్వే వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించాలి.
- మహిళా సంఘాలు బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి
- నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి.. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

రైతుల భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో ముఖాముఖి మాట్లాడి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను నల్గొండ జిల్లా అక్టోబర్ 23 నేటి వెలుగు ప్రతినిధి: ఆదేశించారు. భూములకు సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. మహిళా సంఘాలు బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, పశువుల ద్వారా గోబర్ గ్యాస్ తయారీని ప్రోత్సహించాలని తెలిపారు. శుక్రవారం ఆయన దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం, పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాల్లో భూ సర్వే నిర్వహించిన ప్రాంతాలను సందర్శించారు. శుక్రవారం సూర్యోదయానికి ముందే క్షేత్రస్థాయికి చేరుకున్న ఆయన రైతులతో నేరుగా మాట్లాడి భూ సర్వే వివరాలు, భూముల విస్తీర్ణం, రికార్డులు, అభ్యంతరాల గురించి అడిగి తెలుసుకున్నారు.పొగిళ్ల గ్రామంలో సర్వే నంబర్ 2లో 1,066 ఎకరాల భూమిని సర్వే చేసినట్లుఅధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో వాస్తవంగా సాగులో ఉన్న భూమి, అసైన్డ్ భూములు , భూములపై హక్కులు కలిగిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ సర్వేకు సంబంధించిన వివరాలను గ్రామంలో ప్రదర్శించాలని, అవసరమైతే గ్రామసభలో చదివి వినిపించాలని ఆదేశించారు.ఇప్పటివరకు వచ్చిన అభ్యంతరాలు , వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటని అధికారులను ప్రశ్నించారు. మొత్తం 30 అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. భూముల రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, పహాణీ వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణాన్ని సరిపోల్చి పరిశీలించాలని సూచించారు. భూములపై అభ్యంతరాలు వ్యక్తం చేసే రైతులు తమకు సంబంధించిన ధ్రువపత్రాలను చూపించాలని తెలిపారు.అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా అమ్మడం, కొనడం చేయకూడదని స్పష్టం చేశారు. సర్వే వివరాలను పారదర్శకంగా ప్రజలకు తెలియజేసి, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.రైతులతో చర్చించి భూ సమస్యలను పరిష్కరించేందుకు కంబాలపల్లి రైతు వేదికలో రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. సర్వే నంబర్ల వారీగా భూ సర్వే ఎంతవరకు పూర్తయింది, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగిందా, ఇంకా ఎన్ని సర్వేలు చేయాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.సర్వే నంబర్ 37, 50లకు సంబంధించిన సర్వే వివరాలను పరిశీలించి, పూర్తయిన సర్వే వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. సర్వే రికార్డుల్లో ఉన్న వివరాలు, పహాణీలో నమోదైన పేర్లు, వాస్తవంగా భూములు అనుభవిస్తున్న రైతుల వివరాలను సరిపోల్చాలని ఆదేశించారు. వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, మిగిలిన సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నా, రికార్డుల్లో తేడాలు కనిపించినా సంబంధిత రైతులు, అధికారులు కలిసి చర్చించుకోవాలని సూచించారు. అన్నదమ్ములు, ఇతర భూహక్కుదారుల మధ్య సమస్యలు ఉంటే పరస్పరం కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని అన్నారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నవారికి నిబంధనల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని గ్రామాల్లో అందుబాటులో ఉన్న బంజరు భూములను ఉపయోగించుకొని మహిళా సంఘాలు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా మహిళా సంఘాలు ఆదాయాన్ని పెంచుకొని ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు.అలాగే పశువుల పేడతో గోబర్ గ్యాస్ తయారు చేసుకొని ఇంధన అవసరాలను తీర్చుకోవడంతో పాటు వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులు, గ్రామీణ ప్రజలు అనవసర ఖర్చులను తగ్గించుకొని, పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలియన్ చింగ్ థియాన్ మావి, ల్యాండ్ సర్వే ఏడి దేవరాజ్ , తహసిల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ జటా జైహింద్ నాయక్ , మండల సర్వేయర్లు శ్రీనివాస్,హరీష్, కంబాలపల్లి సర్పంచ్ గోవిందు,రైతులు, గ్రామస్తులు కలెక్టర్ వెంట ఉన్నారు .

పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా, దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**